ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 11 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 21 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## అధికారంలోకి రాగానే అవినీతి పాఠశాలలను మూసేస్తాం

### ప్రధాని నరేంద్ర మోదీ పై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీమరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని దేశంలో అవినీతి పాఠశాలను నడుపుతున్నారని అన్నారు. భాజపా నేతలకు అవినీతి పాఠాలను ఆయన చక్కగా బోధిస్తున్నారని 'ఎక్స్' (ట్విటర్) వేదిక వ్యాఖ్యానించారు. 'దేశంలో అవినీతి పాఠశాలను ప్రధాని మోదీ నడుపుతున్నారు. ఈ స్కూల్‌లో 'డొనేషన్ బిజినెస్' అనే కోర్స్‌లోని ప్రతీ అధ్యాయాన్ని స్వయంగా ఆయనే బోధిస్తున్నారు. దానాన్ని కూడా వ్యాపారంగా ఎలా మార్చాలో మోదీ వివరిస్తారు. సోదాలు నిర్వహించి విరాళాలు ఎలా సేకరించాలి?విరాళాలు తీసుకున్న ..మిగతా 2లో



## తెలంగాణపై బీజేపీ నాయకత్వం ఫోకస్

### చివరి వారంలో రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ

### వరసగా తెలంగాణకు అగ్ర నేతలు, మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): తెలంగాణపై భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఫోకస్ పెంచింది. డబుల్ డిజిట్ టార్గెట్‌గా రాష్ట్రానికి బీజేపీ జాతీయ నేతలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ హైకమాండ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. ఇందు కోసం ప్రత్యేక షెడ్యూల్ కూడా రెడీ రూపొందించింది. ఇప్పటికే బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటించారు. పార్టీ శ్రేణులతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఇక తాజాగా మరోసారి ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణలోని పర్యటించిన ప్రధాని మోదీ ఆదిలాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, నాగర్‌కర్నూల్, మల్కాజ్‌గిరి సభల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఈ నెల చివరి వారంలో రాష్ట్రంలో పర్యటించబోతున్నట్టు తెలుస్తోంది. మోదీ రాక ..మిగతా 2లో

## బీజేపీకి బిగ్ షాక్..

### యూపీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గుండెపోటుతో మృతి



మొరాదాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. దేశవ్యాప్తంగా తొలిదశ పోలింగ్ ముగిసిన 24 గంటల వ్యవధిలోనే యూపీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి మృతి చెందారు. గతకొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ..మిగతా 2లో

## నేను కరెంట్ తీగ లాగే

# సన్నగా ఉంటా

### టచ్ చేస్తే షాక్ సాలిడ్‌గా ఉంటుంది

### కేసీఆర్‌కు మరోమారు రేవంత్ హెచ్చరిక

### మెదక్ అభ్యర్థి నీలం నామినేషన్‌లో పాల్గొన్న రేవంత్




మెదక్, ఏప్రిల్ 20 ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): 'కరెంట్ వైర్ కూడా నా లాగా సన్నగా ఉంటది, దాన్నిటచ్ చేస్తే షాకే సాలిడ్‌గా ఉంటుంది ' అంటూ ఊసరవెల్లి సినిమాలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగుల్ని రేవంత్ రెడ్డి.. రాజకీయ ప్రసంగాల్లో తనకు అన్వయించుకుని ..కేసీఆర్ హెచ్చరిస్తున్నారు. మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నామనేషన్ కార్యక్రమంలో రేవంత్ పాల్గొని తర్వాత జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. కాంకాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని పిట్టలదొర కేసీఆర్ అంటుండు.. అదేమైనా నువ్వు తాగే ఫుల్ బాటిలా అయిపోవడానికి. ఇక్కడున్నది రేవంత్ రెడ్డి.. హైటెన్షన్ కరెంట్ వైర్.. బిడ్డా టచ్ చేసి చూడు.. చూస్తూ ఊరుకోవడానికి నేను జైపాల్ రెడ్డి, జానారెడ్డిని కాదు.. మా ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఉరికించి కొడతా జాగ్రత్త' అంటూ కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. కారు పని అయిపోయిందని కార్ఖానాకు పోయిందని.. ఇక బయటకు రాదన్నారు. వచ్చే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పని అయిపోయిందని అన్నారు.దేశంలో కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆనాడు ఇక్కడి ప్రజలు మెదక్ గడ్డపై ఇందిరమ్మను గెలిపించారని రేవంత్ రెడ్డి ప్రజలకు ..మిగతా 2లో



## ట్యాక్స్ సిటీని.. ట్యాంకర్ సిటీగా మార్చిన కాంగ్రెస్

### బెంగళూరులో కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శలు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్ని కల ప్రచారంలో భాగంగా కర్నాటకలోని చిక్కబ ల్లాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ట్యాక్స్ సిటీని కాంగ్రెస్ ట్యాంకర్ సిటీగా మార్చిందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. వ్యవసాయం నుంచి పట్టణ మౌలిక సదుపాయాల వరకు బడ్జెట్‌లో కోత పెడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ దృష్టి కేవలం అవినీతిపైనే ఉందన్న మోదీ, బెంగళూరు సమస్యలపై కాదన్నారు. అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు. కాంగ్రెస్, భారత్ కూటమి పాలనలో కర్ణాటకలో బాంబులు పేలుతున్నాయన్నారు. భజన, కీర్తనలు చేస్తున్న వారిపై దాడులు జరుగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యర్థులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్న ప్రధాని.. మోదీ లక్ష్యం దేశాభివృద్ధే అన్ని స్పష్టం చేశారు. కాంగ్రెస్ దాడులు చేస్తున్నారు, అభివృద్ధి పనుల్లో బీజేపీ బిజీగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, భారతీయ బ్యాంకులు సంక్షోభంలో ఉన్నాయని, మోసాలు విదేశీ పెట్టుబడిదారులను ఇబ్బందులకు గురిచేశాయని ప్రధాని మోదీ గుర్తు చేశారు. కానీ నేటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు భారత్‌తో అనుసంధానం కావాలని, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుకుంటున్నాయన్నారు. భారతదేశం రికార్డు స్థాయిలో ఎగుమతులు చేస్తోంది. గతంలో భారతదేశం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేది, కానీ ..మిగతా 2లో



యూపీఎస్సీ లో మూడు ర్యాంకు సాధించిన అన్య రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసే శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు, అనన్య కుటుంబ సభ్యులు

## అనన్య రెడ్డికి సీఎం రేవంత్ అభినందన

హైదరాబాద్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): యూపీఎస్సీ సివిల్స్ 2023 టాప్ 3 ర్యాంక్ సాధించిన దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం పొన్నాకల్ గ్రామానికి చెందిన దోనూరి అనన్య రెడ్డి కుటుంబ సభ్యులు శనివారం స్థానిక దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తో కలసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు, ఈ సందర్భంగా అనన్య రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సన్మానించారు. అనన్య రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి లు సన్మానించారు.



అనన్య రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## ప్రకాష్ గౌడ్ పార్టీ మారితే రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జిగా పట్లోల్ల కార్తీక్ రెడ్డిని నియమించాలి

బుద్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పార్టీ మారితే....రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్చార్జిగా యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని నియమించాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ క్యాడర్ పటిష్టంగా ఉండాలన్నా, పార్టీని బలోపేతం చేయాలన్నా, కార్తీక్ రెడ్డి లాంటి యువ నాయకుడు అవసరమని గుర్తు చేస్తున్నారు. ఒకప్పుడు చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ అంతర్భాగంలో ఉన్నటువంటి రాజేంద్రనగర్ ప్రాంతంపై హోంశాఖ మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి కుటుంబం ముద్ర ఎంతగానో ఉంది. మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కి రాజేంద్రనగర్ నియోజకవర్గం లో మంచి పట్టు ఉంది. వీటన్నిటిని బేరీజు వేసుకొని సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటే .... రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంఛార్జీగా పట్లోళ్ల



సబితా ఇంద్రారెడ్డి తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చే భర్తీ చేస్తే బాగుంటుందని మెజారిటీ నాయకులు, ప్రజలు సూచిస్తున్నారు.ద ..మిగతా 2లో

## మెదక్ అభివృద్ధిని చూపించడానికి సిద్ధం

### సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్

నాడు మెదక్ జిల్లాకు నిధులు తరలిస్తున్నారని విమర్శించారు..

ఇప్పుడేమో అభివృద్ధి చేయలేదంటారా?

కేసీఆర్ కృషివల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి

సమస్యలపై నిలదీస్తే అసహనమెందుకు?

2



## కాంగ్రెస్‌కు సీపీఐ, సీపీఎం మద్దతు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎన్నికల పొత్తుపై కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి నడిచేందుకు కామ్రేడ్స్ సిద్ధమయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇండియా కూటమిలో భాగమైన సీపీఐ, సీపీఎం మద్దతు కోరారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. దీంతో తెలంగాణలో బీజేపీని ఎదుర్కొనేందుకు తాము కాంగ్రెస్‌ట మద్దతు ఇస్తున్నామని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. పార్లమెంటు ఎన్నికల్లో మద్దతు కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం సీపీఎం నేతలతో సమావేశమయ్యారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో భేటీ అయ్యారు. ఇక శనివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ ముఖ్య నేతలతోనూ చర్చలు జరిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కలిసి పనిచేయాలని మూడు పార్టీల నేతలు నిర్ణయించారు. బీజేపీని తెలంగాణలోకి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని సిపిఐ వెల్లడించింది. ఆ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మీడియా సమావేశంలో తెలిపారు.సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని, నిర్ణయించే ఎన్నికలని ఇరు పార్టీల నేతలు తెలిపారు. మతోన్మాదంతో నియంతృత్వ పోకడలతో ..మిగతా 2లో

## నేను కరెంట్ తీగ లాగే

# సన్నగా ఉంటా



మొదటి పేజీ తరువాయి...

గుర్తుచేశారు. 1999 నుంచి 2024 వరకు 25 సంవత్సరాలు మెదక్ పార్లమెంట్ బీజేపీ, బీఆరెఎస్ చేతిలోనే ఉందన్నారు. ఆనాడు ఇందిరమ్మ తెచ్చిన పరిశ్రమలు తప్ప.. బీజేపీ, బీఆరెఎస్ ఈ ప్రాంతానికి చేసిందేం లేదని విమర్శించారు. పదేళ్ల బీఆరెఎస్ పాలనలో మెదక్ ప్రజలకు ఒరిగిందేం లేదు అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'దుబ్బాకలో గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెస్తానన్న రఘునందన్ రావును అడుగుతున్నా.. మేమంతా బస్సులేసుకుని దుబ్బాక వస్తాం. నువ్వు తెచ్చిన నిధులేంటో.. చేసిన అభివృద్ధి ఏంటో చూపించు. పదేళ్లు మోదీ ప్రధానిగా ఉన్నారు. కేసీఆర్ సీఎం గా ఉన్నారు. ఈ పదేళ్లలో వీళ్లు తెచ్చిన పరిశ్రమలు ఎన్ని? చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లిడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందించే ప్రజా పాలన కాంగ్రెస్ సొంతం అని తెలిపారు. రూ.22,500 కోట్లతో పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నాం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తాము ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూస్తుంటే.. కడుపు మండిన మోదీ, కేసీఆర్ కాంగ్రెస్ ను ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలను అందించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. మల్లన్న సాగర్, రంగనాయక్ సాగర్ రైతుల భూములు గుంజుకున్న దుర్మార్గుడు బీఆరెస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అని ఫైర్ అయ్యారు.

## ట్యాక్స్ సిటీని.. ట్యాంకర్ సిటీగా మార్చిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు భారతదేశం మొదటి ఐదు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందన్నారు. 2014కు ముందు చాలా పరోక్ష పన్నులు ఉండేవని ప్రధాని మోదీ అన్నారు. అయితే జీఎస్టీ అమల్లోకి వచ్చాక పరోక్ష పన్నులు తగ్గాయి. ఇది వేల రూపాయలు ఆదా చేయడంలో సహాయపడింది. గతంలో దాదాపు రూ.400 ఉండే ఎల్ఈడీ బల్బు ఇప్పుడు రూ.40 మాత్రమే పలుకుతుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు శరవేగంగా సాగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 2014లో మెట్రో నెట్‌వర్క్ 17 కిలోమీటర్లు మాత్రమే ఉండగా ఇప్పుడు అది 70 కిలోమీటర్లకు పైగా పెరిగింది. 2014, 2019లో రికార్డు ఓట్లతో విజయం సాధించామని, దాని ఫలితమే బలమైన ప్రభుత్వమని అన్నారు. ఇప్పుడు 2024లో బలమైన ప్రభుత్వం ఏర్పడితే దేశ ప్రగతికి కీలక నిర్ణయాలు తీసుకోవచ్చని మోదీ అన్నారు.

## కాంగ్రెస్‌కు సీపీఐ, సీపీఎం మద్దతు

మొదటి పేజీ తరువాయి...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ భారత రాజ్యాంగానికి పెను సవాలు విసురుతున్నారని ఆరోపించారు. ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు లౌకికవాద పార్టీలతో కలిసి ఇండియా కూటమి ఏర్పడినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సహచరుల సూచనల మేరకే మద్దతు కోరినట్లు డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సహకారం, మద్దతు అందించాల్సిందిగా అభ్యర్థించానన్నారు.తెలంగాణలో లౌకికవాదాన్ని కాపాడే క్రమంలోనూ, పేద ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి, రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీని అడ్డుకునేందుకు కలిసి ప్రయాణించాలనే నిర్ణయానికి రావడం జరిగిందన్నారు భట్టి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలోని 17 లోక్ సభ నియోజకవర్గాల్లోనూ కలసి ముందుకు వెళ్ళాలని మూడు పార్టీలు నిర్ణయించాయి.



## వివాహ ప్రాప్తి రద్దు

### చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించాల్సిన 'వివాహ ప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ప్రకటించారు. శుక్రవారం గరుడ ప్రసాదం పంపిణీలో ఇబ్బందులు తలెత్తిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు తమ ఇళ్లలోనే దేవుడిని ప్రార్థించుకోవాలని సూచించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించాల్సిన కళ్యాణోత్సవం యథావిధిగా జరుగుతుందన్నారు.

## అధికారంలోకి రాగానే అవినీతి పాఠశాలలను మూసేస్తాం

మొదటి పేజీ తరువాయి...

అనంతరం ఒప్పందాల పంపిణీ ఎలా చేయాలనే అంశాలను వివరిస్తారు' అని రాహుల్ ఆరోపించారు. అయితే, కాషాయ పార్టీలోని ప్రతి నేతకూ ఈ కోర్సును తప్పనిసరి చేసిందన్నారు. అవినీతిపరుల నేర మరకలను వాషింగ్ మెషీన్‌లా కడిగేస్తోందంటూ భాజపాను ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ఏజెన్సీలను రికవరీ ఏజెంట్లుగా మార్చి 'బెయిల్', 'జైలు' అనే గేమ్‌ను ఎలా ఆడాలో వివరించగలదన్నారు. అవినీతికి భాజపా నిలయంగా మారిందని విమర్శించారు. ఒక వేళ సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే మోదీ నడుపుతున్న అవినీతి పాఠశాలతో పాటు ఈ కోర్సును పూర్తిగా మూసివేస్తుందని అన్నారు.

## హైదరాబాద్‌లో తాగునీటికి డోకా లేదు

### నాగార్జున సాగర్ ఎమర్జెన్సీ పంపింగ్



హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ మహానగరానికి వేసవి నీటి కష్టాలు గట్టెక్కించేందుకు జలమండలి శ్రీకారం చుట్టింది. అందుకోసం నాగార్జున సాగర్ జలాశయంలో ఎమర్జెన్సీ పంపింగ్ మొదలుపెట్టింది. 10 పంపులను ఉన్నతాధికారుల సమక్షంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. నాగార్జున సాగర్ లో నగర తాగునీటి అవసరాల దృష్ట్యా ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభించినట్లు ఎండి తెలిపారు. అవసరమైతే, రెండో దశ అత్యవసర పంపింగ్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. నీటిలో తేలియాడే సబ్ మెర్సబుల్ పంపుల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మే నెల 15 తేదీ నుంచి ఎల్లంపల్లి జలాశయంలో అత్యవసర పంపింగ్ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఇదే కాకుండా.. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్, సింగూరు జలాశయాల్లో పుష్కలంగా నీరుందని, హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. అవసరమైతే రెండు రిజర్వాయర్ల నుంచి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా తాగునీరు అందించడానికి జలమండలి సిద్ధంగా ఉందన్నారు. నీటి వినియోగదారులందరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎండీ విజ్ఞప్తి చేశారు.



### జెండాలు మార్చే వారిని

## ప్రజలు తిరస్కరిస్తారు

### ఒక పార్టీ పట్ల నిబద్ధత లేని వారిని ప్రజలు నమ్మరు: కేటీఆర్

### పట్నం, రంజిత్‌రెడ్డిని అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): అధికారం కోసం జెండాలు మార్చే నాయకులను ప్రజలు తిరస్కరిస్తారని, ఒక పార్టీ పట్ల నిబద్ధత లేనివారిని నమ్మబోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు అధికారాన్ని అనుభవించి.. పార్టీకి, నాయకత్వానికి నమ్మకద్రోహం చేసి వెళ్లిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఆ నేతలకు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష జరిగింది. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన తీరుపై వారు చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో మరోమారు గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి సానుకూల స్పందన వస్తోందని.. కేసీఆర్ చేవెళ్ల సభ తర్వాత అన్ని వర్గాలు మద్దతు పలుకుతున్నాయని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డితో భేటీకావడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరిగింది. కానీ ఆయన శనివారం కేటీఆర్ అధ్యక్షతన జరిగిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ సమీక్షలో పాల్గొనడం గమనార్హం. కార్యకర్తలు, నాయకుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరికపై వెనక్కి తగ్గినట్టు సమాచారం. కేటీఆర్‌తో భేటీ సందర్భంగా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని ఆయన వివరణ ఇచ్చినట్టు తెలిసింది.

## తెలంగాణపై బీజేపీ నాయకత్వం ఫోకస్

మొదటి పేజీ తరువాయి...



సందర్భంగా బీజేపీ రాష్ట్ర నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ల పర్వం ఊపందుకోవడంతో మోదీ పర్యటనను దిగ్విజయం చేసేందుకు కషాయం దళం సిద్ధమవుతోంది. ఎక్కువ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు నేతలు. మోదీ సభలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్లాన్ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల తర్వాత ప్రచారాన్ని మరింత హోరెత్తించేలా బీజేపీ ప్లాన్ చేస్తోంది. రెండో దశ పోలింగ్ తర్వాత వరసగా తెలంగాణకు అగ్ర నేతల క్యూ కడుతున్నారు. ఈ నెల చివరి వారంలో తెలంగాణకు రానున్న ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో సభలు నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. వీలైనన్ని ఎక్కువ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు.

## బీజేపీకి బిగ్ షాక్..

మొదటి పేజీ తరువాయి...

బీజేపీ అభ్యర్థి కున్వర్ సర్వేశ్ సింగ్ కన్నుమూశారు. ఆయనకు శనివారం సాయంత్రం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు బీజేపీ ఎమ్మెల్యే రితేష్ గుప్తా వెల్లడించారు. కున్వర్ సర్వేశ్ సింగ్ భౌతికకాయాన్ని మొరాదాబాద్‌లోని ఠాకూర్‌ద్వారా ప్రాంతానికి తీసుకురానున్నారు. ఆయన గొంతు సమస్యతో శుక్రవారం ఢిల్లీలోని ఎయిమ్స్ లో హెల్త్ చెకప్ కోసం చేరినట్లు యూపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి తెలిపారు. ఇటీవలే ఆయన గొంతు సమస్యకు శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నట్లు వెల్లడించారు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయన ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొనలేదని భూపేంద్ర చౌదరి తెలిపారు. మొరాదాబాద్ లోక్‌సభ స్థానానికి శుక్రవారం ఓటింగ్ పూర్తయింది. ఇక్కడ ఎస్పీ, కాంగ్రెస్, బీఎస్పీలతో బీజేపీ పోటీ పడింది.కున్వర్ సర్వేశ్ ఓ వ్యాపారవేత్త కాగా.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అతను 1991 నుంచి 2007 వరకు, 2012లో ఠాకూర్‌ద్వారా స్థానం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో మోదీ హవాలో పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కున్వర్ సర్వేశ్ సింగ్ కుమారుడు కున్వర్ సుశాంత్ సింగ్ ప్రస్తుతం బర్హాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. మొరాదాబాద్ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కున్వర్ సర్వేశ్ సింగ్ చాలా కాలం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఒకప్పుడు అమ్రోహా నుంచి ఎంపీగా కూడా ఉన్నారు. అంతేకాకుండా, అతని తండ్రి కూడా ఈ ప్రాంతం నుంచి ఎంపీగా పనిచేశారు. సర్వేష్ సింగ్ తండ్రి రాజా రాంపాల్ సింగ్ కూడా ఠాకూర్‌ద్వారా నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. కున్వర్ సర్వేశ్ సింగ్ గెలిస్తే మొరాదాబాద్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అయితే ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థి గెలిస్తే ఉప ఎన్నిక జరగదు. మొరాదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ ఎంపీ ఎస్టీ హసన్ టిక్కెట్టును రద్దు చేసి రుచి వీరను పోటీకి దింపింది. ఎన్నికల ప్రచారంలో కూడా సర్వేష్ సింగ్ కూడా పాల్గొనలేదు. సర్వేశ్ సింగ్ కుటుంబం అతని కోసం ప్రచారం చేసింది.బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కున్వర్ సర్వేశ్ సింగ్ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఇది బీజేపీ కుటుంబానికి తీరని లోటని.. మృతుల కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఆయనకు నివాళులర్పించారు.



## ఉరుములు, మెరుపులతో వర్షం

### జోరువానతో చల్లబడిన నగరం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ చల్లబడింది. శుక్రవారం సాయంత్రం నుంచి హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఓ మోసతరు వర్షం కురిసింది. దాదాపు అరగంటపాటు అక్కడక్కడా పెద్ద జల్లులు పడ్డాయి. వారం రోజుల నుంచి చెబుతున్నట్టుగానే తెలంగాణలో ఉరుమురు మెరుపులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని చోట్ల వడగళ్ల వాన కూడా పడుతోంది. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న హైదరాబాద్ నగర వాసులకు కాస్త ఊరట లభించించింది. నగరంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నది. రాజేంద్రనగర్, తుర్కయంజాల్, కొత్తపేట, సరూర్‌నగర్, నాగోల్, చైతన్యపురి, చంపాపేట, సైదాబాద్, శంషాబాద్, ఆదిబట్ల, చార్మినార్, నాంపల్లి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, కాచిగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్‌నగర్, బాగ్లింగంపల్లి, రాంనగర్, అడిక్‌మెట్, ఖైరతాబాద్, లక్డీకపూల్, తార్నాక, ఓయూ క్యాంపస్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, ఉప్పల్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, లిబర్టీ, బషీర్‌బాగ్, లంగర్‌హౌస్, కార్వాన్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, మాదాపూర్, బడంగ్‌పేట, జల్‌పల్లిలో వర్షం కురుస్తున్నది. దీంతో నగరమంతా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఉన్నది. శనివారం ఉదయం నుంచి చల్లని గాలులు వీస్తుండటంతో పొద్దున 7 గంటల నుంచే సూర్యుని సెగలతోపాటు వడగాల్పులతో సతమతమవుతున్న నగర ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. కాగా, భానుడి భగభగలతో రాష్ట్రమంతా నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాలలో 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. రాష్ట్రంలో శుక్రవారం ఒక్కరోజే వడదెబ్బ సోకి ఐదుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. రాబోయే రోజుల్లో గరిష్ఠంగా 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అకడకడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. తప్పక వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



## మెదక్ అభివృద్ధిని చూపించడానికి సిద్ధం

గజ్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపించడానికి సిద్ధంగా ఉన్నానని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. ఈ నియోజకవర్గంలో ఇందిరా గాంధీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ముఖ్యమంత్రి చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. అభివృద్ధి అంతా ఉమ్మడి మెదక్ జిల్లాలోనే జరిగిందని, సిద్దిపేట, గజ్వేల్‌కు నిధులు తరలించుకుపోయారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, మెదక్ సభలో అసహనంతో తన మూరత్వాన్ని చాటుకున్నారని ధ్వజమెత్తారు. గజ్వేల్‌లో శనివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ మెదక్‌లో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. కేసీఆర్ కృషి వల్లే ఈ ప్రాంతానికి మంచినీరు, సాగునీరు అందాయని గుర్తు చేశారు. గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు రైల్వేలైన్ తేవడమే కాకుండా, రెండు యూనివర్సిటీలను తెచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు.

### ప్రజలకు పాలనా సౌలభ్యం కల్పించాం..

ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల ను ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన సౌలభ్యాన్ని కల్పించామని హరీశ్ అన్నారు. దూలమోలె పెరిగాడని రేవంత్ తన పై వ్యాఖ్యలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్కూడా తిట్లు వస్తాయని, కానీ అలా మాట్లాడాలంటే సంస్కారం అడ్డం వస్తుందని చెప్పారు. పార్టీలు మారినవారి పై తక్షణమే అనర్హత వేటువేస్తామని రాహుల్ గాంధీ మేనిఫెస్టో లో పెడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం పార్టీలు మారడానికి వస్తు న్నవారికి కండువాలు కప్పే పనిలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డి ఆడుతున్న అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని దుయ్యబట్టారు. బీసీలతో పాటు మాదిగలకు రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 3 ఎస్సీలకు కేటాయించగా.. అందులో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కసీటు కూడా ఇవ్వలేదన్నారు. మల్లన్నసాగర్‌పై గతంలో తప్పుడు విమర్శలు చేసిన సీఎం నేడు ఇక్కడి నుంచి మంచినీటిని హైదరాబాద్‌కు తీసుకెళ్లడానికి వేగంగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టే లా ఆదేశాలిచ్చారని తెలిపారు.

కేసీఆర్ కృషి వల్లే మల్లన్నసాగర్ హైదరాబాద్ తాగునీటికి ప్రత్యేకమైన వనరుగా మారిందన్నారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిపై కూడా తప్పు డు విమర్శలు చేస్తున్నారని, ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నారని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి మల్కాజ్‌గిరికి వచ్చి ఎంపీగా పోటీ చేయలేదా అని ప్రశ్నించారు.

### కేజీబీవీలో ఫుడ్ పాయిజన్.. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రభుత్వ హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ సంఘటనలపై మండిపడ్డారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. 'మొన్న భువనగిరి గురుకుల హాస్టల్లో కలుషిత ఆహారం తిని చనిపోయిన ప్రశాంత్ ఉదంతాన్ని మరవక ముందే మరో ఫుడ్ పాయిజన్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం 11 మంది విద్యార్థినులు కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ గురుకులాల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరికి ఈ ఉదంతాలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే బాధిత విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ రావు అన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లొద్దు

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం) : శంషాబాద్ మండలానికి చెందిన మెజారిటీ బీ ఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళవద్దు అని తేల్చి చెప్పారు. పార్టీ మారే విషయంపై శనివారం మైలార్ దేవ్ పల్లి లోని తన నివాసంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా శంషాబాద్ మండల , మున్సిపాలిటీల బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్ గౌడ్ ను కాంగ్రెస్ లోకి వెళ్ళవద్దంటూ తమ మనసులోని మాటను తెలియజేశారు. మంత్రి పదవి ఇస్తే వెళ్లండి కానీ అదేమీ లేకుంటే వెళ్ళవద్దని సూచించారు . కాంగ్రెస్ లోనే గ్రూపులు ఉన్నాయని మీరు అక్కడికి వెళ్తే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

**రెండు రోజుల తర్వాత మరొకసారి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి... ముఖ్యమంత్రికి తెలిపి తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్న ప్రకాష్ గౌడ్ :**

శంషాబాద్ మండల, మున్సిపాలిటీ నాయకులు కాంగ్రెస్ లోకి వెళ్ళవద్దని సూచించడంతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన నిర్ణయం పై సందిగ్ధంలో పడ్డారు. సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు రోజులలో మరొకసారి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రికి చెప్పి తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. బీఆర్ఎస్ తనకు మంచి అవకాశం ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలిచి కాంగ్రెస్ లో చేరాలని కోరితేనే నాయకులతో చెప్పి వారి అభిప్రాయాలను సేకరించడం జరిగిందన్నారు.



శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి రెడ్డి

## మహబూబ్ నగర్ బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపిస్తా

### దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కొండారెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణ ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి రెడ్డి అన్నారు. శనివారం లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం బూత్ అధ్యక్షుల సమీక్ష సమావేశంలో దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రచారంలో అవలంబించవలసిన విధి విధానాలను, ఇంటింటి ప్రచారం, ఓటర్లను కలవడం వివిధ అంశాలపై చర్చించడం జరిగింది. మహబూబ్ నగర్ లోక్ సభ ఎంపీ అభ్యర్థి డీకే అరుణమ్మ కి దేవరకద్ర నియోజకవర్గం నుండి లక్ష మెజారిటీ వచ్చే విధంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, వెంకటేష్,నవీన్ గౌడ్, వెంకట్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,భూత్ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## అక్రమ మద్యం పట్టివేత

ఎర్రవల్లి,ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు గ్రామ సమీపంలో ఇటిక్యాల పోలీసులు పట్టుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తెలంగాణకు చెందిన మద్యం 100 బాటిళ్లను కర్నూల్ చెందిన పాయజ్ బాషా ఆటోలో కర్నూలుకు తరలిస్తుండగా.లక్ష రూపాయలు విలువచేసే 100 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## హడలెత్తిస్తున్న వరుస దొంగతనాలు

మల్దకల్,ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)వరుస దొంగతనాలతో మల్దకల్ మండల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని అమరవాయి గ్రామంలో సుమారు రెండు మూడు నెలల సమయంలోనే వరుస చోరీలు జరుగుతుండడంతో గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో బస్టాండ్ వద్ద దొంగలు వచ్చి కలకలం లేపారు. బయట నిద్రిస్తున్న రహీంబేగ్ జేబులోంచి రూ.2,000 చోరీ జరిగిందని బాధితుడు తెలిపారు. ఓ హొటల్ లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న పుస్తెలతాడు దొంగలించారు. చెవిలోని కమ్మలును చోరీ చేస్తుండగా ఆమె కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. నెలరోజుల క్రితం బస్టాండ్ లో ఉన్న చింతలముని నల్లారెడ్డి స్వామి ఆలయంలో హుండీని దొంగలించారు. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామాలలోని దేవాలయాలే టార్గెట్ చేసి విచ్చలవిడిగా వరుస దొంగతనాలు, తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని పోలీసులు నిఘా పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమీషనర్ మధ్య వాగ్వివాదం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)గత కొంతకాలంగా గద్వాల మున్సిపాలిటిలో గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కు, గద్వాల మున్సిపల్ కమీషనర్ శంకర్ సింగ్ మధ్య మనస్పర్థలు పెరిగిపోయాయి. గద్వాల మున్సిపాలిటిలో పని చేసే జవాన్లు మున్సిపల్ చైర్మన్ ఇంటి వద్ద పని చేస్తూ నెల జీతాలు తీసుకోవడంతో జీతాల విషయంపై శని వారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో చైర్మన్, కమీషనర్ చర్చించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసే వారికి జీతాలు నిలిపివేస్తామని కమీషనర్ చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో ఒకరిపై నొక్కరు విమర్శలు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మున్సిపల్ చైర్మన్ పై కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కాగ చెత్త సేకరణ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మాణం అందరూ ఆమోదింపజేసి ఉన్నతాధికా రులకు అందజేశారు. ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకణ లోపంతో వార్డులలో చెత్త సేకరణ సమస్య తలెత్తడంతో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లకు పట్టణం ప్రజలు పదే పదే పోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ కమీషనర్ మున్సిపల్ చైర్మన్ మధ్య గతంలోనే మాటల యుద్దం నడిచినట్లు చోటు చేసుకుంది. గత కొన్ని రోజులుగా మున్సిపల్ బడ్జెట్ నిధుల విడుదల, ఖర్చుల నిమిత్తం అయిన వాటిని అమలు చేయాలని చైర్మన్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయి తే నిధుల విడుదల అంశంలో అవినీతి ఆరోపణలు ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ అభ్యం తరం తెలిపారని సమాచారం. ఈ విషయం పై ప్రజాప్రతినిధులకు, కమీషనర్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగింది అయితే నాయకులు, కమీషనర్ మధ్య వైరం ముదిరి ఒకరి పై నొక్కరు ఘాటు పదాజాలంతో విమర్శ లు చేసుకున్నట్లు కార్యాలయం లో చర్చించుకోవడం కొసమెరుపు.

**కమీషనర్ కాలర్ పట్టుకున్నారంటూ...**

శనివారం గద్వాల మున్సిపాలిటి కార్యాలయంలో చైర్మన్, వార్డు కౌన్సిలర్ లు కమిషనర్ తో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు కమీషనర్ కాలర్ పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో, పలు ఎలక్ట్రానిక్ మీడియాలో వార్త వెలువడింది. మున్సిపల్ లో జరిగిన విషయంపై జిల్లా కలెక్టర్ కు గద్వాల మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు పరస్పరం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగ గద్వాల మున్సిపాలిటిలో పని చేసే కార్మికుల జీతాలు ఇవ్వకుండా కమీషనర్ వేధింపులకు గురి చేస్తున్నారని ప్రధాన ఆరోపణలు. అంతే కాకుండా కార్మికులను వివిధ కారణాలతో వేదిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై మున్సిపల్ కమీషనర్ శంకర్ సింగ్ వివరణ కోరగా అలాంటిదేమి లేదని, మున్సిపాలిటిలో ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోలేదని వెల్లడించారు.

## మహావీర్ జయంతి సందర్భంగా నేడు చికెన్ మటన్ దుకాణాలు మూసివేయాలి

### కమిషనర్ సుమన్ రావు



శంషాబాద్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం చికెన్ మటన్ దుకాణాలను మూసివేయాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు ఆదేశించినట్లు శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. మహావీర్ జయంతి సందర్భంగా మాంసాహారాన్ని విక్రయించే దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలియజేయడం జరుగుతున్నదని వివరించారు. శంషాబాద్ మునిసిపల్ పరిధిలో ఉన్న చికెన్, మటన్ దుకాణాలు బంద్ పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని వారిపై చట్టపరంగా చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మునిసిపల్ పరిధిలో మాంసాహారాన్ని విక్రయించే వారందరూ ఈ నిబంధనలను పాటించాలని లక్ష్మయ్య స్పష్టం చేశారు.



ఈద్ మిలాప్ లో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకటరమణ తదితరులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈద్ మిలాప్

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం): సర్వమతాలవారు పరస్పరమైన ప్రేమ, స్నేహభావంతో కలిసిమెలిసి జీవనం సాగించినప్పుడే సంస్థలు, సమాజం ప్రశాంతంగా ఉంటాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ అభిప్రాయపడ్డారు. తరతరాలుగా పరమత సహనం, సహజీవనాలకి భారతదేశం మారుపేరన్నారు. అన్ని మతాలవారు తమ పండగలని ప్రశాంతంగా నిర్వహించుకునే వాతావరణం దేశంలో తరతరాలుగా ఉందన్నారు. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించుకోవాలని వెంకటరమణ అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకొని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఈద్ మిలాప్ ను నిర్వహించారు. దీనిలో ముస్లిం మత పెద్దలు, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. షీర్ ఖుర్మా పంపిణీ చేశారు.

## చేవెళ్ల పార్లమెంటులో శనివారం ఆరు నామినేషన్లు

బుద్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం): పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ళ లోక్ సభ నియోజక వర్గానికి సంబంధించి మూడవ రోజైన శనివారం ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. మహమ్మద్ సలీం రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థిగా ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ సమర్పించారని రిటర్నింగ్ అధికారి తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఇసరి సూర్యప్రకాష్ రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థిగా అంజనేయులు నీరటి, ప్రజా వెలుగు పార్టీ అభ్యర్థిగా టి.దుర్గ ప్రసాద్ లు ఒక్కొ సెట్ చొప్పున నామినేషన్ వేశారని వివరించారు. కాగా, మొదటి, రెండవ, మూడవ రోజు కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం పదకొండు మంది అభ్యర్థులు పన్నెండు నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి శశాంక తెలిపారు.

## కొండ విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్

రాజేంద్ర నగర్,(ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ కోరారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణు గోపాల్ హాజరు హయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు,ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్,కార్పొరేటర్ సంగీత గౌరిశంకర్,కొమరయ్య,కడెం సుధాకర్,రాజశేఖర్, జయనంద్ రెడ్డి, సులిగే వెంకటేష్,కిరణ్ చారి, కాకులరం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





అత్తాపూర్ డివిజన్ బిజెపి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్



చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

## కోట మైసమ్మ దేవాలయంలో చండీ యాగం

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం): బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా శనివారం చండీయాగం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ యాగాన్ని ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొనసాగించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ యాగంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే దేవాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాల యానికి వస్తున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు



పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

## డీకే అరుణమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

మక్తల్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణమ్మను భారీ మెజారిటీతో గెలిపించే విధంగా ఓటర్లను కలుసుకొని ప్రచారం నిర్వహించాలని బిజెపి రాష్ట్ర నాయకులు, మక్తల్ అసెంబ్లీ ప్రబారి బొక్క బాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్ నగర్ పార్లమెంటు పరిధిలోని మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నర్వ మండల్, ఊట్కూర్ మండల్, మాగనూరు మండలాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి బూత్ ఇంచార్జ్ కనీసం 370 ప్రతి బూతులో ఓట్లు వచ్చే విధంగా పని చేయా లన్నారు. ప్రతి బూతు అధ్యక్షులు ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పథకాలు కరపత్రాల ద్వారా ఇంటింటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్ణ స్వామి , జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ , ఎంపీటీసీ బలరామరెడ్డి , జిల్లా కార్యదర్శి సత్యం, రవీందర్ రెడ్డి రమేష్, ఊటుకూరు మండల అధ్యక్షులు భరత్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నారాయణ మాగనూరు మండల అధ్యక్షులు విద్యాసాగర్ రావు కనకరాజు, బిజెపి మూడు మండలాల పోలింగ్ బూత్ ప్రెసిడెంట్లు ఎంపీటీసీలు మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ గ్రామాలకు చెందిన నాయకులకు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



పాలెం మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్ రెడ్డికి స్వాగతం ఎమ్మెల్యే జీఎంఆర్

### బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీలోకి కొనసాగుతున్న చేరికల పర్వం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి కి మద్దతుగా వరుస చేరికలు.

కొత్తకోట, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం కు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం పాలెం గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్ రెడ్డి , గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ మైబు, మాజీ సర్పంచ్ జె. బాలరాజ్, ఎస్. కిరణ్ కుమార్, లోక రెడ్డి, సి. రాంరెడ్డి, రామచంద్ర రెడ్డి, ఎస్. రాములు తదితర గ్రామ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మదనాపురం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటన్న గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సి. నాగేశ్వర్ రెడ్డి, నరేందర్ గౌడ్, ఎస్. కిషోర్ కుమార్, గౌతమ్ కుమార్, జి. మురళీధర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ నాగిరెడ్డి, వి. నరసింహారెడ్డి, హమాలీ సంఘం అధ్యక్షులు వంగూరు గోపాల్, జె. బాలకొండయ్య, జె. పెద్ద నాగన్న, గుండె నారాయణ, శ్రీనివాసులు, బాలస్వామి, ఎండి మౌలా, మెయిన్ దాబా, సంద రామచందర్ లతోపాటు 210 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు. బిఎస్పీ పార్టీ నుండి దేవరక్కద్ర బీఎస్పీ మండల అధ్యక్షులు బిజిలి బాలరాజ్, బిఎస్పి భూత్పూర్ మండల అధ్యక్షులు లింగళ్ల నర్సింహులు, కౌకుంట్ల మండల బి.ఎస్.పి అధ్యక్షులు స్వాతి సాగర్, బహుజన సమాజ్ పార్టీ సోషల్ మీడియా బిజిలి మహేష్, ఆర్ బుచ్చయ్య, ఉరడి నరేష్, అజయ్, రఘు, డి. బాలరాజ్, రాజు, సురేష్, గణేష్, సుధాకర్, రవి, జి. సాగర్ , బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు.....పెద్ద ఎత్తున దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన నాయకులు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు.

## హైదరాబాదీ బ్యాటర్ల
# పెను విధ్వంసం

### ఢిల్లీపై ఘన విజయం..

**ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అదిరే ప్రదర్శన చేస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌ను సైతం చిత్తు చేసి పాయింట్ల పట్టికలో టాప్-2లోకి ప్రవేశించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, షాబాద్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 266/7 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం ఢిల్లీని 199 పరుగులకు కుప్ప కూల్చింది. హైదరాబాద్ జట్టుకు ఇది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం.**



ఐపీఎల్ 17వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొడుతోంది. భారీ స్కోర్లు చేస్తూ ప్రత్యర్థి జట్లకు సవాల్ విసురుతోంది. తాజాగా శనివారం (ఏప్రిల్ 21) రాత్రి ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన 35వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 67 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 266 పరుగుల భారీ స్కోరు చేసింది. భారీ లక్ష్యఛేదనలో దిల్లీ 19.1 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. జేక్ ఫ్రేజర్ (18 బంతుల్లో 65, 5 ఫోర్లు, 7 సిక్స్ లు ), అభిషేక్ పోరెల్ ( 22 బంతుల్లో 42, 7 ఫోర్లు, ఒక సిక్స్) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. రిషబ్ పంత్ (34 బంతుల్లో 44, 5 ఫోర్లు, ఒక సిక్స్) చాలా సేపు క్రీజులో ఉన్నా దూకుడుగా ఆడలేకపోయాడు. మిగతా బ్యాటర్లు రాణించకపోవడం, భారీ లక్ష్య ఛేదన కావడంతో ఢిల్లీకి పరాభవం తప్పలేదు. హైదరాబాద్ బౌలర్లలో నటరాజన్ 4, మయాంక్ 2, నితీశ్ కుమార్ రెడ్డి 2, భువనేశ్వర్, వాషింగ్టన్ సుందర్‌లకు తలో వికెట్ దక్కింది. ఐపీఎల్ 2024 లో హైదరాబాద్‌కు ఇది ఐదో విజయం. అదే సమయంలో ఢిల్లీకి ఐదో ఓటమి. అంతకు ముందు ట్రావిస్ హెడ్ 89, అభిషేక్ శర్మ 46 పరుగులు చేశారు. ఇద్దరూ తొలి వికెట్‌కు 131 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే వీరిద్దరూ అవుటైన తర్వాత మిడిలార్డర్ నిరాశపర్చింది. దీంతో హైదరాబాద్ రన్ రేట్ నెమ్మదించింది. నితీష్ రెడ్డి 37, హెన్రిక్ క్లాసెన్ 15, ఐడాన్ మర్క్రామ్ 1 రనౌట్ అయ్యారు. అయితే తర్వాత షాబాజ్ అహ్మద్ ఎట్టకేలకు భారీ షాట్లు కొట్టి హైదరాబాద్ 250కి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. షాబాజ్ 59 పరుగులు చేశాడు. అబ్దుల్ సమద్ 13 పరుగులు చేశాడు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లు తీశాడు. ముఖేష్ కుమార్, అక్షర్ పటేల్ చెరో వికెట్ కోల్పోయారు.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్ ఎలెవన్:**

పాట్ కమిన్స్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఐదాన్ మర్క్రమ్, హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), అబ్దుల్ సమద్, నితీష్ రెడ్డి, షాబాజ్ అహ్మద్, భువనేశ్వర్ కుమార్, మయాంక్ మార్కండే, టి నటరాజన్.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:**

ఉమ్రాన్ మాలిక్, అన్మోల్‌ప్రీత్ సింగ్, ఆకాష్ మహరాజ్ సింగ్, గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్

**ఢిల్లీ ప్లేయింగ్**

రిషబ్ పంత్ (కెప్టెన్ %౿% వికెట్ కీపర్), డేవిడ్ వార్నర్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, అభిషేక్ పోరెల్, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్, లలిత్ యాదవ్, కుల్దీప్ యాదవ్, ఎన్రిక్ నార్జే, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:**

పృథ్వీ షా, షాయ్ హెూప్, ప్రవీణ్ దూబే, రసిఖ్ దార్ సలామ్, సుమిత్ కుమార్





## ఇరుజట్ల కెప్టెన్లకు బిసిసిఐ ఫైన్

ఐపీఎల్ 17 సీజన్ లో భాగంగా శుక్రవారం నాడు చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య హెూరాహెూరి మ్యాచ్ జరిగింది. చివరకు లక్నో సూపర్ జెయింట్స్ విజయాన్ని అందుకుంది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికంగా జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి మొదట సీఎస్కే ను బ్యాటింగ్ కు ఆహ్వానించింది లక్నో సూపర్ జెయింట్స్. దాంతో బ్యాటింగ్ మొదలుపెట్టిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఆటగాళ్లు మొదటగా అంతగా రాణించలేదు. చివర్లో రవీంద్ర జడేజా అజయ అర్ధ శతకం, అలాగే మహేంద్ర సింగ్ ధోని 9 బంతులలో 28 పరుగులు చేయడంతో 20 ఓవర్లలో సిఎస్కె 6 వికెట్లు నష్టపోయి 176 పరుగులను చేయగలిగింది. ఇక లక్ష ఛేదనలో లక్నో బ్యాట్స్మెన్స్ మెరుపు ఇన్నింగ్స్ ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా జట్టు కెప్టెన్ రాహుల్, మరో ఓపెనర్ డికాక్ ఇద్దరు అర్ధ సెంచరీలు చేయడంతో వారి విజయం వైపు బాటలు వేశారు. ఇక చివర్ లో నికలస్ పురాన్, మార్కస్ స్టొయినిస్ కలిసి విజయాన్ని పూర్తి చేశారు. ఈ విషయం ఇలా ఉండగా.. ఈ మ్యాచ్ లో ఇరు జట్లు స్లో ఓవర్ రేట్ మైంటైన్ చేయడంతో ఐపీఎల్ ప్రకారం నిర్ణిత సమయంలో బౌలింగ్ పూర్తి చేయనందున ఇరుజట్ల కెప్టెన్లకు బిసిసిఐ ఫైన్ వేసింది. ఇద్దరికీ మొదటి తప్పిదం కాబట్టి ఒక్కొక్కరికి రూ. 12 లక్షల జరిమానాను బిసిసిఐ విధించింది. ఇదే తప్పు మరోసారి జరిగినట్లయితే కెప్టెన్ కు 24 లక్షల జరిమానాతో పాటు జట్టులో భాగమైన ఆటగాళ్ల ఫీజులో ఒక్కొక్కరికి 25% కోత, లేకపోతే ఆరు లక్షల రూపాయల ఫైన్ విధించడం జరుగుతుంది. ఇక ఈ సీజన్లో ఇప్పటివరకు రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్, సంజూ సామ్సన్, శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా జరిమానా బారిన పడగా తాజాగా కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్ కూడా ఈ జాబితాలో చేరారు.





## ఇది పొరుగువారి హక్కు

### రోహిత్ శర్మ వ్యాఖ్యలపై అఫ్రిది రెస్పాన్స్

ఇండియా-పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలపై ఇటీవల భారత కెప్టెన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య క్రికెట్ మ్యాచుల్ని పున:ప్రారంభించడం వల్ల టెస్టు క్రికెట్‌కి పెద్ద ఊపునిస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై పాకిస్తాన్ మాజీ స్టార్ ప్లేయర్ షాహీద్ అఫ్రిది స్పందించారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాల కారనంగా దశాబ్దకాలంగా ద్వైపాక్షిక సిరీస్ జరగలేదు. క్లబ్ ప్రైరీ ఫైర్ పోడ్‌కాస్ట్ చర్చ సందర్భంగా.. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ రోహిత్ శర్మని ప్రశ్నిస్తూ%ొ% "భారతదేశం పాకిస్తాన్‌తో క్రమం తప్పకుండా ఆడటం టెస్ట్ క్రికెట్‌కి అద్భుతంగా ఉంటుందని మీరు అనుకోవడం లేదా..?" అని అడిగారు. ఈ ప్రశ్నకు రోహిత్ శర్మ బదులిస్తూ.." నేను దీన్ని పూర్తిగా నమ్ముతున్నాను, వారిది మంచి జట్టు, అద్భుతమైన బౌలింగ్ లైనప్ ఉంది. మంచి పోటీ ఇస్తుంది. చివరి టెస్ట్ 2007-08లో జరిగింది. పాకిస్తాన్‌తో ఆడటానికి నేను ఇష్టపడుతాను. ఇరు జట్ల మధ్య పోటీ గొప్పగా ఉంటుంది. ఐసీసీ ట్రోఫీల్లో వారితో ఆడుతున్నాము." అని అన్నారు. రోహిత్ వ్యాఖ్యలపై అఫ్రిది స్పందిస్తూ ఇది సానుకూల ప్రకటన అని ప్రశంసించారు. భారత్-పాకిస్తాన్ మధ్య విభేదాలను పరిష్కరించడానికి క్రీడలు సహాయపడతాయని అన్నారు. "భారత కెప్టెన్ నుంచి ఇది సానుకూల ప్రకటన. అతను భారత రాయబారి కూడా. పాకిస్తాన్-ఇండియా మధ్య సంబంధాల గురించి మేము ఎప్పటి నుంచో చెప్పాము. క్రీడలు ముఖ్యంగా క్రికెట్ గురించి మాట్లాడాం. మేము భారత్ వెళ్లి క్రికెట్ ఆడేవాళ్లం ఇది సంబంధాలను పెంచుతుంది. మంచి సంబంధాలను కలిగి ఉండటం పొరుగువారి హక్కు" అని అఫ్రిది సమా టీవీతో అన్నారు.

## డిఫరెంట్ కోసం చేసిన ప్రయత్నం

### ఓ మైడియర్ దొంగా రివ్యూ

ఓటీటీ ఆడియన్స్‌ను టార్గె చేసుకుని ఇటీవల కొన్ని సినిమాలు రూపొందుతున్నాయి. ఆ జాబితాలోని 'మై డియర్ దొంగ' విడుదలైంది. అభినవ్ గోమఠం , షాలిని కొండెపూడి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా ప్రముఖ తెలుగు ఓటీటీ 'ఆహా' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఓ డేటింగ్ యాప్‌నకు కాపీ రైటర్‌గా పనిచేసే సుజాత (షాలిని), డాక్టర్ విశాల్ (నిఖిల్ గాజుల) ప్రేమికులు. తొలుత బాగానే ఉన్నా కొంతకాలం తర్వాత విశాల్‌లో మార్పు వచ్చిందని సుజాత భావిస్తుంది. డ్యాన్స్ క్లాస్, యోగా శిక్షణ.. ఇలా ఎక్కడికి పిలిచినా బిజీ అని చెబుతున్నాడంటూ ఫీలైపోతుంటుంది. ఈ క్రమంలోనే సురేశ్ (అభినవ్ గోమఠం) ఆమె ఫ్లాట్‌లో చోరీ చేసేందుకు వెళ్తాడు. అదే సమయానికి షాలిని బర్త్‌డే సెలబ్రేషన్ చేసేందుకు స్నేహితులు బుజ్జి (దివ్య శ్రీపాద), వరుణ్ (శశాంక్ మండూరి), విశాల్ ఆమె ఇంటి వస్తారు. అప్పటికే సురేశ్‌తో కాసేపు మాట్లాడిన సుజాత.. అతడిని తన చిన్ననాటి స్నేహితుడిగా వారికి పరిచయం చేస్తుంది. సురేశ్.. సుజాత ఇంట్లో ఏ వస్తువు చోరీ చేశాడు? అసలు.. దొంగ అని తెలిసినా సుజాత.. సురేశ్‌తో ఎందుకు పరిచయం పెంచుకుంది? వారి కుటుంబ నేపథ్యాలేంటి? విశాల్ పోలీసుస్టేషన్‌కు వెళ్లడానికి కారణమేంటి? అనేది సినిమా కథ. ఓ హీరోయిన్.. ఇద్దరు హీరోలు.. ప్రేమ.. చివరికి ఎవరో ఒకరు ఫీలవడం.. ఈ టెంప్లేట్ ఎన్నో సినిమాల్లో చూసేందే. ఇది ఆ ఫార్మాట్‌లో సాగే స్టోరీనే. కానీ, కామెడీ ప్రధానంగా తీర్చిదిద్దడంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒకట్రెండు సన్నివేశాలు మినహా సినిమా ఆద్యంతం నవ్వులు పూయిస్తుంది. లగ్జరీ అవసరం లేదు.. చిన్న చిన్న ఆనందాలే జీవితం అనుకునే




యువతి సుజాత కథ ఇది. ఆమె ప్రేమ కథలను నేరుగా చెప్పకుండా.. ఓ హోటల్‌లో వెయిటర్‌కు సుజాత తన బ్యాక్ స్టోరీలను తానే వివరించడం ఆసక్తి కలిగిస్తుంది. ఈ సినిమా కథను తానే స్వయంగా రాయడం విశేషం. ఆమె చేసే ఉద్యోగ ప్రస్తావన, స్నేహితులు, ప్రేమికుడు విశాల్ పరిచయ సన్నివేశాలు నెమ్మదిగా సాగినా.. సుజాత ఫ్లాట్‌లోకి సురేశ్ ప్రవేశించడం నుంచి కథలో వేగం పుంజుకుంటుంది. అభినవ్ తనదైన మార్క్ హావభావాలతో అలరించారు. తమ కుటుంబాల గురించి సుజాత, సురేశ్ ఒకరికొకరు వివరించే తీరు కన్ఫ్యూజ్ క్రియేట్ చేస్తుంది. ఆ ఎమోషనల్ సీన్స్‌ను ఇంకా బలంగా చూపించి ఉంటే బాగుండేది. సుజాత పుట్టిన రోజు ఇతివృత్తంగా రాసిన సీన్స్ కడుపుబ్బా నవ్విస్తాయి. సర్‌ప్రైజ్ చేసేందుకు ఇంటికొచ్చిన బుజ్జి, వరుణ్, విశాల్‌లకు సుజాత.. సురేశ్‌ను తన ఫ్రెండ్‌గా పరిచయం చేయడం, మెకానికల్ ఇంజినీర్‌గా సురేశ్ వారిని నమ్మించేందుకు ప్రయత్నించడం చూస్తే నవ్వాగదు. సురేశ్ గురించి అసలు విషయం తెలుసుకున్న విశాల్ ఏం చేశాడనేది సెకండాఫ్‌లో ప్రధానాంశం. సురేశ్‌ను ఇరికించాలని ప్రయత్నించి తాను పోలీసుకు చిక్కడం, అందుకు సుజాత అవ్వడం.. ఇలా ప్రతి ఎపిసోడ్‌ను ప్రేక్షకుడిని నవ్వించాలనే లక్ష్యంతోనే రూపొందించారు. ప్రీ క్లైమాక్స్ సీన్స్‌ను ఎమోషనల్‌గా రూపొందించినా క్లైమాక్స్‌ను కామెడీ ట్రాక్‌లోనే పెట్టారు.

## నా ప్లేస్‌లో
# దీపిక చేరింది


### ఆమె ఎప్పుడూ కృతజ్ఞతగా ఉండాలి: కరీనాకపూర్

బాలీవుడ్ నటి కరీనా కపూర్ దీపిక పదుకొణెపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తానొక ప్రాజెక్ట్ వదులుకున్నానని, ఆ అవకాశం దీపికను వరించిందని ఆమె అన్నారు. కాబట్టి దీపిక తనకు కృతజ్ఞతలు చెప్పాలని నవ్వుతూ అన్నారు. ఇంతకీ ఆ సినిమా ఏంటి అన్నది తాజా ఇంటర్వ్యూలో చెప్పారామె. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ రూపొందించిన 'రామ్ లీలా' . రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొణె ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా షూట్‌లోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇదిలా ఉండగా, 'రామ్‌లీలా' హీరోయిన్‌గా మొదట అవకాశం తనకే వచ్చిందని తాజాగా కరీనా కపూర్ తెలిపారు. 'నేను విధిరాతను నమ్ముతుంటా. మనకు ఏదైతే రాసి పెట్టి ఉంటుందో తప్పకుండా అది జరిగి తీరుతుంది. అన్నీ అందరికీ రాసి ఉండవు. ఆ సినిమా అవకాశం వచ్చినప్పుడు అనుకోని కారణాలతో దానిని అంగీకరించలేదు. దాంతో ఆ అవకాశం దీపికను వరించింది. అలా, రణ్‌వీర్‌తో ఆమె తొలిసారి వర్క్ చేశారు. వాళ్లిద్దరి రిలేషన్‌కు పరోక్షంగా నేనే కారణం. కాబట్టి వాళ్లిద్దరూ నాకు కృతజ్ఞతలు చెప్పాలి' అని కరీనా చమత్కరించారు. అలాగే గతంలో వదులుకున్న కొన్ని





చిత్రాల గురించి కూడా ఆమె మాట్లాడారు. 'కల్ హో నా హో'లో హీరోయిన్‌గా ఛాన్స్ వచ్చినప్పటికీ చేయలేదని అన్నారు. ఒకవేళ ఆ సినిమా చేసి ఉంటే సైఫ్ అలీఖాన్‌తో తన బంధం ఎప్పుడో మొదలయ్యేదని అన్నారు. జీవితంలో ఎప్పటికీ సంజయ్ లీలా భన్సాలీ మూవీలో యాక్ట్ చేయనని గతంలో ఓ సందర్భంలో కరీనాకపూర్ చెప్పిన విషయం తెలిపిన సంగతి తెలిసిందే!




## విక్రమార్కుడు సీక్వెల్‌కు
# రంగం సిద్ధం

తెలుగులో 'విక్రమార్కుడు 2', హిందీలో 'రౌడీ రాథోడ్ 2' సినిమాల కోసం కథ సిద్ధమైంది. ఆర్టిస్ట్‌ల ఎంపిక పూర్తి కాగానే సినిమాకు సంబంధించి అప్‌డేట్ వస్తుంది' అని అన్నారు నిర్మాత కె.కె.రాధా మోహన్ అన్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై వరుసగా సినిమాలు నిర్మిస్తున్న ఆయన హిందీలో చేసిన తొలి చిత్రం 'రుస్లాన్'. ఆయుష్‌శర్మ కథానాయకుడు. సుశ్రీ మిశ్రా కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. కరణ్.బి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకొస్తోందీ సినిమా. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఈ సినిమా టీజర్‌ని చాలాసార్లు చూశా. చూసిన ప్రతిసారీ కొత్త కోణం కనిపిస్తోంది. సల్మాన్‌ఖాన్‌తో సినిమా జరుగుతున్నప్పుడు సెట్లో ఆయుష్‌ని చూశా. దర్శకత్వ శాఖలో పనిచే?సవారు. అప్పుడే ఓ హీరోలా కనిపించాడు. ఇందులో బాగా నటించాడు. రాధా మోహన్ తపన ఉన్న నిర్మాత. ఈ సినిమాని అద్భుతంగా నిర్మించారు. జగపతిబాబు ఇందులో కనిపించిన విధానం మరింత ప్రత్యేకం' అన్నారు. నిర్మాత కె.కె.రాధామోహన మాట్లాడుతూ 'భావోద్వేగాలు, యాక్షన్, చక్కని సంభాషణలు, అందమైన విజువల్స్ గొప్ప అనుభూతిని పంచేలా చిత్రాన్ని తీశాం. హిందీలో నా రెండో చిత్రం కోసం రచయిత విజయేంద్రప్రసాద్ కథ సిద్ధం చేశారు. అది తెలుగులో 'విక్రమార్కుడు2'గా, హిందీలో 'రౌడీరాథోడ్2'గా తెరకెక్కుతుంది. ఆయన సల్మాన్ ఖాన్ కోసం 'బజరంగి భాయ్‌జాన్2' కథని కూడా సిద్ధం చేసి, సల్మాన్‌ఖాన్‌కి వినిపించేందుకు సిద్ధంగా ఉన్నారు' అని అన్నారు.